https://teluguislam.net


## శవశుభ్రత (శవానికి స్నానం చేయించుట)

**92వ అంశం :** శవానికి స్నానం చేయించటానికి మునుపు కాస్త పరిశీలనగా చూసి అతని కడుపులోని మలినాలు బయటపడి వుంటే వాటిని దూరం చేసి శరీరాన్ని శుభ్రపర్చాలి.

**93వ అంశం :** మృతుని అతి సమీప బంధువులు మృతుని ఖనన సమయాన సమాధిలో దిగాలి.

హజరత్ అలి(రఅ) ఇలా తెలిపారు నేను ప్రవక్తగారి శరీరానికి స్నానం చేయించాను. ఆయన పరిశుద్ధ శరీరాన్ని పరీక్షించాను, గానీ ఏవిధమైనా మలినమూ కానరాలేదు. ఎందుకంటే ప్రవక్తగారు సజీవస్థితిలో పరిశుద్ధంగా ఉన్నట్లే మరణం తర్వాత కూడా పరిశుద్ధంగానే ఉన్నారు. ఆయన ఖనన సంస్కారాలకై నలుగురుని ప్రత్యేకంగా నియమింపబడినారు. వారు: అలీ (ప్రవక్తగారి అల్లుడు), అబ్బాస్ (ప్రవక్తగారి పినతండ్రి), వారు ప్రవక్తగారి శరీరాన్ని సమాధిలో దించి ఆ తర్వాత ఇటుకలు పేర్చారు. ఫజల్ (ప్రవక్తగారి పినతండ్రిగారి కుమారుడు), సాలిహ్ (ప్రవక్తగారు స్వేచ్ఛ కల్పించిన బానిస లేదా సేవకుడు వారు ప్రవక్త గారి శరీరాన్ని సమాధిలో దించి ఆ తర్వాత ఇటుకలు పేర్చారు. సత్య స్వేచ్ఛ ఆధారాలతో హాకిం మరియు బైహఖీ, అల్బానీగారు అహకాముల్ జనాయిజ్ పేజి148లో పేర్కొన్నారు.)

**94వ అంశం :** శవానికి స్నానం చేయించే ముందు ఆ శవానికి వజూ చేయించాలి.

**95వ అంశం :** శవస్నానానికై వాడే నీటిలో రేగాకులు వేయటం సదాచారం. "నీటిని కొద్దిగా వేడిచేస్తే మంచిది."

**96వ అంశం :** బేసి సంఖ్యలో (మూడు ఐదు లేక ఏడుసార్లు) నీరుపోస్తూ స్నానం చేయించాలి.

**97వ అంశం :** చివరిసారిలో పోసే నీటిలో కర్పూరం వేయటం సదాచారం.

**98వ అంశం :** శవం స్త్రీదైతే స్నానం చేయించిన తర్వాత వెంట్రుకలను మూడు జడలుగా అల్లి వెనుకకు వేయాలి.

హజరత్ ఉమ్మె అతియ్యా(రఅ) ఇలా తెలిపారు: ప్రవక్త ముహమ్మద్(సల్లల్లాహు అలైహివసల్లం) గారి పుత్రిక జైనబ్ (రజియల్లాహు అన్హా) యొక్క మృతదేహానికి స్నానం చేయించు సమయాన ప్రవక్తగారు వచ్చి ఇలా పలికారు. ఆమెకు నీరు మూడుసార్లు, ఐదుసార్లు లేదా అవసరమనుకుంటే ఇంకా ఎక్కువసార్లు నీరుపోసి స్నానం చేయించండి. ముందు ఆ నీటిలో రేగాకు వేయండి. చివరిసారి కర్పూరం కలిపిన నీరు పోయండి. పూర్తయిన తర్వాత నాకు తెలపండి: స్నానం పూర్తయిన పిమ్మట ఆయనకు తెలుపగా ఆయన తన వస్త్రం మావైపు విసరి దాన్ని ఆ మృతదేహానికి చుట్టమని తెలిపారు. మరొక హదీస్‌లో అయనిలా పేర్కొన్నట్లు తెలుపబడింది. ఆమెకు బేసి సంఖ్యలో అనగా మూడు, ఐదు లేదా ఏడుసార్లు నీరుపోసి స్నానం చేయించండి. ఆమెను శుభ్రపరచునప్పుడు వజూ చేయించే సమయాన ఆమె కుడిభాగం నుండి ప్రారంభించండి. తర్వాత ఉమ్మె అతియ్యా ఇలా తెలిపారు. అమె వెంట్రుకలను మూడు జడలుగా అల్లి ఆమె వెనుకభాగాన వేశాము. (దీన్ని బుఖారి మరియు ముస్లిం పేర్కొన్నారు.)

https://teluguislam.net



**99వ అంశం :** మృతదేహానికి సమీప బంధువు మతాఆదేశాలు తెలిసినవాడు స్నానం చేయించాలి. అటువంటి వారు లేకపోతే దైవభక్తి కలిగిఉన్న ఇస్లాం మత విద్యావేత్త ఎవరైనా స్నానం చేయించాలి.

**100వ అంశం :** మృతుని స్నానం చేయించే వ్యక్తి మృతుని లోపాలను దాచదగిన విషయముంటే కప్పి ఉంచితే అల్లాహ్ అతని పాపాలను క్షమిస్తాడు.

హజ్రత్ అబూ ఉమామ (రఅ) ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త (సఅసం) గారు ఇలా సెలవిచ్చారు. ఎవరైతే మృతున్ని స్నానం చేయించినప్పుడు మృతునిలో ఏదైనా లోపాన్ని చూసి బయటపెట్టకుండా దాచితే అల్లాహ్ కూడా స్నానం చేయించే వ్యక్తి పాపాలను దాస్తాడు. ఇంకా ఎవరైనా ఒక ముస్లిం మృతునికి శవవస్త్రాలను కల్పిస్తాడో అలాంటి వారికి (తీర్పుదినం నాడు) అల్లాహ్ "సుందుస్" వస్త్రాలు ధరింపచేస్తాడు.(తిబ్రాని అల్బానీగారి అససహీహ్ 2353)

**101వ అంశం :** మృతుని స్నానం చేయించేటప్పుడు పరదా (తెరబాటు) పెట్టడం తప్పనిసరి.

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ(రఅ) గారి ఉల్లేఖనం ప్రకారం ప్రవక్త గారు ﷺ ఇలా సెలవిచ్చారు. "ఏ పురుషుడైనా సరే పరపురుషుల మర్మాంగాలను చూడరాదు. మరియు ఏ స్త్రీ కూడా పర స్త్రీల మర్మాంగాలను చూడరాదు. (ముస్లిం)

**102వ అంశం :** మృతునికి స్నానం చేయించిన వాడు స్వయంగా స్నానం చేస్తే మంచిది. ఒకవేళ చేయకపోయినా పరవాలేదు.

హజరత్ అబుహురైరా(రఅ) ఇలా తెలిపారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహిసల్లం) గారు ఇలా పలికారు. శవానికి స్నానం చేయించిన వారు స్వయంగా స్నానం చేయాలి. శవాన్ని మోసినవారు వజూ చేయాలి. (దీన్ని తిర్మిజీ,993, 791 సహీహ్,నసాయి పేర్కొన్నారు)

హజరత్ ఇబ్నె అబ్బాస్(రఅ) ఇలా తెలిపారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహ్ అలైహివసల్లం) గారు ఇలా బోధించారు. మీరు మృతులకు స్నానం చేయించి తర్వాత స్వయంగా స్నానం చేయనవసరం లేదు. మృతదేహం అపవిత్రమూ కాదు. మలిన వస్తువు కాదు. మీరు చేతులు కడుక్కుంటే చాలు. (హాకిం బైహఖీ,అల్లామా అల్బానీగారి అహకాముల్ జనాయిజ్ పేజి53)

**103వ అంశం :** షహీదులకు (అల్లాహ్ మార్గంలో వీరమరణం పొంది వీరస్వర్గం పొందిన వారికి) స్నానం చేయించనవసరం లేదు.

హజరత్ జాబిర్(రఅ) ఇలా తెలిపారు. ప్రవక్తగారు ఉహద్ యుద్ధములో వీరమరణం పొందిన మృతులను ఒక్కొక్క వస్త్రంలో ఇద్దరు చొప్పున శవ వస్త్రధారణ చేసి ఆ ఇద్దరిలో ఖుర్ఆన్ ఎక్కువగా ఎవరికి కంఠస్థంగా ఉందో అడిగి జవాబు ప్రకారం సమాధిలో ముందు ఆ ఎక్కువ జ్ఞానం గలవానిని ఉంచేవారు ఆ తర్వాత ఆయనిలా పలికారు. ఈ వీర స్వర్గవాసులందరకి పుణ్యకార్యాల గురించి నేను అంతిమ దినాన అల్లాహ్ సమక్షాన సాక్ష్యమిస్తాను. తర్వాత వారందరినీ వారి రక్తసిక్త శరీరాలు మరియు దుస్తులతో పాటే సమాధుల్లో ఖననం చేయించారు. వారికి స్నానము చేయించలేదు. (దీన్ని బుఖారీ పేర్కొన్నారు.)

https://teluguislam.net



**104వ అంశం :** భర్త భార్యకు, భార్య భర్తకు స్నానం చేయించవచ్చు.

హజరత్ ఆయిషా(రఅ) ఇలా తెలిపారు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహివసల్లం) బఖీఅ అను స్మశానంలో ఒక శవం యొక్క ఖనన సంస్కారాలు పూర్తిగావించి నావద్దకు వచ్చారు. అప్పుడు నా తలలో నొప్పిగా ఉంటే ఇలా పలికాను. నా తలలో భరించరాని నొప్పి ఉంది. అప్పుడు ప్రవక్తగారిలా అన్నారు: నా తలలో కూడా భరింపరాని నొప్పి ఉంది. తర్వాత ఇలా పలికారు. అపార్థం చేసుకోవద్దు. నీవు నాకంటే ముందూ చనిపోతే నేనే స్వయంగా నీకు స్నానం చేయించి నీకు శవ వస్త్రాలు చుట్టి తర్వాత నమాజ్ జనాజా ఆచరించి నేనే నిన్ను ఖననం చేస్తాను. (దీన్ని అహ్మద్, ఇబ్నె మాజా1198 హసన్ అని పేర్కొన్నారు.)

హజరత్ ఆయిషా(రఅ) ఇలా పలుకుతున్నారు నాకు తర్వాత తెలిసిన విషయం కాస్తముందుగా తెలిసి ఉంటే ప్రవక్తగారికి స్వయంగా ఆయన భార్యలే స్నానం చేయించి ఉండేవారు. (అహ్మద్, అబుదావూద్ ఇబ్నెమాజహ్. 1196)

హజరత్ అబ్దుల్లాహ్‌బిన్‌అబూబకర్(రఅ) ఇలా తెలిపారు: అబూబకర్ (రజియల్లహుఅన్‌హు) గారు మరణించినప్పుడు ఆయన భార్య అస్మా (ఉమైస్ పుత్రిక) ఆయనకు స్నానం చేయించింది. తర్వాత బయటకు వచ్చి అక్కడున్న ముహాజిర్లనిలా ప్రశ్నించింది. ఈరోజు చాలా చలిగా ఉంది. నేను తప్పనిసరిగా స్నానం చేయాలా? స్నానం చేయనవసరం లేదని వారు బదులిచ్చారు. (దీన్ని మాలిక్ తన గ్రంథముముఅత్తాలో పేర్కొన్నారు.)

**105వ అంశం :** శవానికి స్నానం చేయించే సమయాన ఖుర్‌ఆన్ పఠించటం లేదా పెద్ద గొంతులో దుఆలు స్మరించటం నిరాధారం మరియు ప్రవక్తగారి ఆదేశాలకు వ్యతిరేకం.